## చివరి ఆయకట్టుకూ సాగునీరందాలి

❖ ప్రాజెక్టుల నీటిని వృథా చేయొద్దు: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

❖ గూడెం దొడ్డి భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి.



**దశ, మహబూబ్‌నగర్ బ్యూరో:** రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశించారు. గద్వాలలోని తన క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటిని వృథా చేయకుండా వారబందీ పద్ధతిలో విడుదల చేయాలని సూచించారు. రైతులను ఆరుతడి పంటల సాగు వైపు ప్రోత్సహించాలని కోరారు. నారాయణపూర్ నుంచి జూరాలకు నీరు రానున్నందున నియోజకవర్గంలోని రిజర్వాయర్లు, చెరువులను త్వరగా నింపాలని ఆదేశించారు. సోమనాద్రిగట్టు ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని 3 టీఎంసీలకు పెంచే డీపీఆర్ పనులను, గూడెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచేందుకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి

*సీపీఐ మండల కార్యదర్శి, కొండు బానేష్*

**దశ, బెల్లంపల్లి:** ఏఐవైఎఫ్ తాండూర్ మండల 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కొండు బానేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 22న తాండూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 1959 నుంచి ఏఐవైఎఫ్ యువత సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఎలాంటి ష్యూరిటీ లేకుండా బ్యాంకు రుణాలు అందించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు నిరుద్యోగ భృతిని వెంటనే అందించాలని కోరారు. యువత సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటాలు నిర్వహించేందుకు మహాసభల్లో పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

## ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు విషయంలో చర్యలు తీసుకోండి

❖ కమిషనర్‌ను కోరిన బీఆర్ఎస్ నాయకులు



**దశ, జిన్నారం:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ప్రజలకు ఇబ్బంది కలిగే చోట ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయడం ఇబ్బందికరంగా ఉంటుందని మనుషులు పశువులు తిరగని స్థలంలో 11 కెవి ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేసేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ నరేందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, మాట్లాడుతూ, ప్రజలు ఏమాత్రం దూర దృష్టి లేకుండా ప్రజలకు ఇబ్బంది కలిగే చోట విద్యుత్ శాఖ అధికారులు మన చాయి దుకాణం పక్కనే 11 కెవి ట్రాన్స్ఫారం గద్దెను ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదని అన్నారు. ఎవరికి ఇబ్బంది లేని చోట ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని బిఆర్ఎస్ నాయకులు కోరారు. కమిషనర్ కు సమాచారం ఇవ్వకుండా ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయాలనుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం స్థలం మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి చూపించారని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలకు ఇబ్బందిగా కలిగే చోట ఎలా ట్రాన్స్ఫారం కోసం స్థలం చూపిస్తారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో విద్యుత్ సమస్య ఎక్కడుందో ముందుగా పరిశీలించి ఆ ప్రాంతంలో నూతన ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నాయకులు విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంద రమేష్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, నాగరాజు యాదవ్, శ్రీధర్ గౌడ్, మల్లేష్ యాదవ్, బ్రహ్మేంద్ర గౌడ్, మల్లేష్, నిఖిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పెంట్లవెల్లి ఆఫీస్‌లో జూపల్లి తనిఖీ





❖ ఆర్డీవోపై మంత్రి ఆగ్రహం.. స్వయంగా టాయిలెట్ శుభ్రం చేసిన జూపల్లి

❖ ఇందిరమ్మ ఇళ్లకు రూ.4 లక్షల వరకు సాయం

**దశ, మహబూబ్‌నగర్ బ్యూరో:** నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల రెవెన్యూ కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, ప్రజల వినతుల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు ఫైళ్లు అపరిష్కృతంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆర్డీవోను ప్రశ్నించారు. కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్వయంగా నీళ్లు పోసి టాయిలెట్‌ను శుభ్రం చేసి అధికారులకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం మండల కేంద్రంలో పర్యటించిన మంత్రి స్థానికుల ఇళ్లను పరిశీలించి ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే గోడలు నిర్మించుకుని స్లాబ్ దశలో ఉన్న వారికి రూ.2 లక్షలు, బేస్ లెవెల్ పూర్తయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి రూ.4 లక్షల వరకు సాయం అందిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, వారి ఆర్థిక పరిస్థితి, ఇంటి స్థితిగతుల ఆధారంగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 11వ తెలంగాణ మాస్టర్ స్విమ్మింగ్‌లో అంబర్‌పేట్ క్రీడాకారుల సత్తా

❖ ఇంద్రసేన యాదవ్‌కు 5 స్వర్ణాలు.. రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్



**దశ, హైదరాబాద్:** జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్విమ్మింగ్ పూల్‌లో ఆగస్టు 15న నిర్వహించిన 11వ తెలంగాణ మాస్టర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ -2026లో అంబర్‌పేట్ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇంద్రసేన యాదవ్ ఐదు స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్‌ను కైవసం చేసుకున్నారు. వి. రమణ నాలుగు పతకాలు, రాజ్‌కుమార్ సురానా నాలుగు స్వర్ణాలు, ఒక రజత పతకం, మధు మూడు స్వర్ణాలు, రెండు రజత పతకాలు, మురళీధర్ రెడ్డి రెండు రజత పతకాలు సాధించి జట్టు విజయానికి తోడ్పడ్డారు. విజేతలను అంబర్‌పేట్ మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి. మల్లేష్ యాదవ్, రమేష్ గౌడ్, ఎం. శంకర్ ముదిరాజ్, అమృత్ రెడ్డి, శ్రీనివాస్ బాబా, రాజశేఖర్ రెడ్డి, శివ, ప్రభాకర్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారుల విజయానికి కోచ్‌లు కె. సురేష్, ప్రశాంత్, సుదీర్, కృష్ణ, గిరి కృషి చేసినందుకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

## బియ్యం పట్టివేత



**దశ, హయత్‌నగర్ :** హయత్‌నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూర్యనగర్ కాలనీకి చెందిన అంగోతు లక్ష్మణ్ (52) తన గదిలో 42 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించిన హయత్‌నగర్ పోలీసులు శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో దాడి చేసి బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బియ్యం ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలించేందుకు నిల్వ చేశారనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## రూ.2 కోట్ల మోసం చేశారని ఆరోపణలు

❖ ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



**దశ, ఆసిఫాబాద్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రూ.2 కోట్లకు పైగా ఆర్థిక మోసం జరిగిందని ఆరోపిస్తూ 40-50 మంది బాధితులు శుక్రవారం జిల్లా ఎస్పీ నితికా పంత్‌ను ఆశ్రయించారు. ఆసిఫాబాద్‌కు చెందిన షేక్ ఖలీల్ అహ్మద్‌కు వివిధ సందర్భాల్లో 40-50 మంది డబ్బులు ఇచ్చినట్లు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే నిర్ణీత సమయంలో డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, తమకు న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. భారీ మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. బాధితుల ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపడితే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఉపాధ్యాయుల రక్షణకు ప్రగతి విద్యాలయం ర్యాలీ

**దశ, పెబ్బేరు:** ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు రక్షణ కల్పించేందుకు "టీచర్స్ ప్రొటెక్షన్ యాక్ట్" ను ప్రభుత్వం వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేస్తూ పెబ్బేరు, వనపర్తిలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రగతి విద్యాలయం ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రూపారెడ్డి ఘటన నేపథ్యంలో ఉపాధ్యాయుల భద్రత, గౌరవం, హక్కులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రగతి విద్యాలయం ఉపాధ్యాయులు ర్యాలీలో ముందుండి నినాదాలు చేస్తూ, పాటలు పాడుతూ తమ డిమాండ్లను బలంగా వినిపించారు. ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టడంతో పాటు, విధి నిర్వహణలో వారికి పూర్తి రక్షణ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల భద్రత కోసం అన్ని వర్గాల ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. టీచర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ సాధించే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు.

# బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెంటనే రాజీనామా చేయాలి

❖ రామన్నపేట కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

❖ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి



**దశ, రామన్నపేట:** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా ఏకపక్ష, అప్రజాస్వామిక వైఖరిని అవలంబిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. రామన్నపేట కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీసీఐ స్వతంత్ర చట్టబద్ధ సంస్థ అని, ఏ రాజకీయ పార్టీకి లేదా ప్రభుత్వానికి అనుబంధంగా ఉండకూడదన్నారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు ఇవ్వడం ఏకపక్ష నిర్ణయమని విమర్శించారు. కొందరు విద్యార్థుల చర్యలకు మొత్తం బ్యాచ్‌ను శిక్షించడం సరికాదన్నారు.

ఆ ఆదేశాలను తర్వాత ఉపసంహరించుకున్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టిన బాధ్యత నుంచి బీసీఐ చైర్మన్ తప్పించుకోలేరని అన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిళ్ల స్వతంత్రతలో జోక్యం చేసుకోవడం, న్యాయ విద్యా ప్రమాణాలు, న్యాయ కళాశాలల తనిఖీలు, అనుమతులకు సంబంధించిన ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

బీసీఐ కోల్పోయిన గౌరవం, విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు మనన్ కుమార్ మిశ్రా వెంటనే రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వంచ జగతయ్య, జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, గడ్డం నరసింహ, వీరమల్ల నర్సింహ, అంతటి రమేష్, అంకం నరేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య విద్యా వ్యవస్థకే మాయని మచ్చ

**దశ, రామన్నపేట:** కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య విద్యా వ్యవస్థకే మాయని మచ్చ అని రామన్నపేట మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. హత్యను నిరసిస్తూ శుక్రవారం మండలవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బంద్ నిర్వహించారు.

పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుంచి సుభాష్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుభాష్ సెంటర్‌లో రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలల కరెస్పాండెంట్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రక్షణ లేకపోవడం ఆందోళనకరమన్నారు.

కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రుల ధోరణిలో వస్తున్న మార్పులు విద్యా వ్యవస్థకు ముప్పుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, రూపారెడ్డి హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి. మల్లికార్జున్, జె. మార్టిన్, జి. నరేందర్‌రెడ్డి, కనకాచారి, నాగరాజు, శ్రీధర్‌తో పాటు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జెన్-జీని 'దిమాగీ నక్సల్స్'గా ముద్ర వేయడం
# మోదీ అసహనానికి నిదర్శనం






**దశ, ఓయూ:** ప్రశ్నించే జెన్‌జీ యువతను 'దిమాగీ నక్సల్స్'గా ముద్ర వేయడం ప్రధాని నరేంద్ర మోదీ అసహనానికి నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. యువతపై కపట ప్రేమ చూపడం కాకుండా ఉపాధి, విద్య, సామాజిక భద్రత, ప్రజాస్వామ్య హక్కులు కల్పించే విధానాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చింతకాని మండలంలోని కామ్రేడ్ పగడాల భరత్‌కుమార్ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా 15వ మహాసభలో ఆయన మాట్లాడారు.

మహాసభకు ముందు యువజన ప్రదర్శన నిర్వహించారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం పోరాడుతామని నినాదాలు చేస్తూ కార్యకర్తలు ప్రదర్శన చేపట్టారు. అనంతరం మాజీ యువజన నాయకుడు కొండపర్తి గోవిందరావు ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో జెన్‌జీ యువతను 'దిమాగీ నక్సల్స్'గా చిత్రీకరించేలా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, పేపర్ లీకులు, యువతకు నిధుల విడుదల వంటి అంశాలపై ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పాల్సిన పాలకులు వారిపై ముద్రలు వేయడం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు.

యువతను దేశ భవిష్యత్తు అంటూ ఒకవైపు ప్రశంసిస్తూ, మరోవైపు ప్రశ్నించే యువతను అనుమానాస్పదంగా చిత్రీకరించడం బీజేపీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. జెన్‌జీకి ఎలాంటి ముద్రలు అవసరం లేదని, ఉద్యోగాలు, విద్య, సామాజిక భద్రత, ప్రజాస్వామ్య హక్కులు కావాలని పేర్కొన్నారు. ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కులేనని స్పష్టం చేశారు. దేశంలో నిరుద్యోగం, విద్యా సంక్షోభం, ధరల పెరుగుదల, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ వంటి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి పదజాలాన్ని ఉపయోగించవద్దని సూచించారు. యువతను ముద్రలతో కాకుండా ఉద్యోగాలతో గెలుచుకోవాలని, ప్రశ్నించే గొంతులను అణచకుండా వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

### స్థానిక పరిశ్రమలతో ఉపాధి కల్పించాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధ్యాసాధ్యాలపై సమగ్ర అధ్యయనం చేసి ముందుకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, గ్రానైట్ తదితర స్థానిక వనరుల ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసి జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. 'వనరులు మనవి-ఉద్యోగాలు మన యువతకే' అనే నినాదంతో స్థానిక ఉపాధి కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

మహాసభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ యువజన నాయకుడు బాగం హేమంత్‌రావు, సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గౌస్‌బాషా, కార్యదర్శి నానబాల రామకృష్ణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 700 మంది కార్యకర్తలు హాజరయ్యారు.

## పంటలు సస్య రక్షణపై క్షేత్ర స్థాయి ప్రదర్శనలు



**దశ, హైదరాబాద్:** ఆమనగల్లు మండలంలోని రాంనుంతల, పోలేపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో జొన్న, వరి పంటల్లో సస్య రక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై శుక్రవారం క్షేత్ర స్థాయి ప్రదర్శనలు నిర్వహించారు. ఆత్మ పథకం ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడపీడలు, తెగుళ్లను గుర్తించే విధానం, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల్లో తెగుళ్లను తొలిదశలోనే గుర్తించి సకాలంలో నియంత్రణ చర్యలు చేపడితే పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్, సూక్ష్మ పోషకాలు, మందు గుళికలను అందజేశారు.

పంట అవసరాలకు అనుగుణంగా వీటిని వినియోగించడం ద్వారా మొక్కల ఆరోగ్యం మెరుగుపడి, దిగుబడులు పెరిగే అవకాశం ఉందని వివరించారు.ఈ సందర్భంగా ఏవో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులు సంప్రదాయ సాగు పద్ధతులతో పాటు శాస్త్రీయ విధానాలను కూడా అవలంబించాలని సూచించారు. నేల స్వభావాన్ని బట్టి ఎరువులను వినియోగిస్తూ, పంటలకు సమతుల్య పోషకాలను అందించాలని తెలిపారు. సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.

## అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

*ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎస్పీ రోహిత్ రాజు*



**దశ, అశ్వారావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ ఎస్పీకి స్వాగతం పలకగా, పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్, రికార్డులు, పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలకు సత్వర న్యాయం అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పేకాట, కోడిపందాలు, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచి, వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనం కేసుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు నిందితులను అరెస్ట్ చేసి, చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ఈసాక్ష్య, నాట్‌గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాల ద్వారా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.డయల్-112కు సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## ఘనంగా ముగిసిన వరలక్ష్మీ వ్రత మహోత్సవం

**దశ, పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో కొలువై ఉన్న శ్రీ లలితా త్రిపుర సుందరి అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెబ్బేరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా అర్చకులు వెంకటేశ్వర్లు శర్మ వరలక్ష్మీ వ్రత విశిష్టతను భక్తులకు వివరించారు. కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరోగ్యం కలగాలని కోరుకుంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారని తెలిపారు.

## పాత కక్షలతో పథకం ప్రకారం హత్య



❖ ముగ్గురు నిందితుల అరెస్ట్

**దశ, హైదరాబాద్:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ గ్రామ శివారులో ఇటీవల జరిగిన హత్య కేసును ధర్మసాగర్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పాత కక్షలను మనసులో పెట్టుకుని ప్రధాన నిందితుడు పథకం ప్రకారం హత్యకు పాల్పడినట్లు కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

విలేకరుల సమావేశంలో ఏసీపీ వెల్లడించిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూర్ మండల కేంద్రానికి చెందిన అంబటి పరమేష్ కుమారుడు వినయ్, అదే గ్రామానికి చెందిన పోలు వెంకటేశ్వర్లు అలియాస్ వెంకన్న చిన్న కుమార్తె రమ్య 2022లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొంతకాలానికి వారి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో ఏడాది తర్వాత ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. ఈ వ్యవహారంతో ఇరు కుటుంబాల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో అంబటి పరమేశ్వర్ గతంలో వెంకటేశ్వర్లుపై హత్యాయత్నానికి ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. అప్పట్లో పెద్దమనుషులు జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగించారు. అయితే పాత కక్షలను మనసులో పెట్టుకున్న పరమేష్.. వెంకటేశ్వర్లును హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ నెల 17న పరమేష్ తనకు సహకరిస్తున్న దామెర సంపత్‌ను వెంకటేశ్వర్లును బయటకు తీసుకురావాలని అతని ఇంటికి పంపించాడు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్న వెంకటేశ్వర్లును సంపత్ మద్యం తాగుదామని చెప్పి బయటకు తీసుకువచ్చాడు. అనంతరం ఇద్దరూ మద్యం సేవించగా, కొద్దిసేపటి తర్వాత పరమేష్ కూడా వారితో కలిశాడు.ముగ్గురూ కలిసి మద్యం సేవించిన అనంతరం మరోసారి మద్యం తీసుకురావాలంటూ పరమేష్, వెంకటేశ్వర్లు ఒకే వాహనంపై రాంపూర్ గ్రామ శివారులోని మాదెలయ్య గుడి వద్దకు వెళ్లారు. అప్పటికే తన వెంట కారం పొడి, కత్తి తీసుకెళ్లిన పరమేష్.. అక్కడ వెంకటేశ్వర్లుపై దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కారం పొడిని అతని కళ్లలో చల్లి, కత్తితో గొంతు కోసి హత్య చేసినట్లు వెల్లడించారు. తీవ్ర గాయాలతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏసీపీ తెలిపారు.సమాచారం అందుకున్న ధర్మసాగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు అంబటి పరమేష్‌తో పాటు అతనికి సహకరించిన దామెర సంపత్, చిలుముల వెంకటస్వామిని గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ముగ్గురినీ రిమాండ్‌కు తరలించారు.



## సీతారామ బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

❖ *రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ*

**దశ, కామేపల్లి:** సీతారామ ప్రాజెక్ట్ భూనిర్వాసితులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కామేపల్లి తహసిల్దార్ శ్రీనివాసరావు కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీతారామ ప్రాజెక్ట్ కాలువల నిర్మాణానికి కామేపల్లి మండలంలో రైతులు వద్ద నుండి భూమిని ప్రభుత్వం 2019లో సేకరించి నాటి నుండి నేటి వరకు రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించలేదని ఆరోపించారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అటు ప్రభుత్వం నుండి రావలసిన నష్టపరిహారం అందక,ఇటు రైతుబంధు రాక పోవడంతో రైతుల పరిస్థితి ఆందోళన కరంగా మారిందని అన్నారు. ప్రభుత్వం రైతులు వద్ద నుండి భూమి స్వాధీనం చేసుకుని సుమారు ఆరు సంవత్సరాల కావస్తున్నా రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం మాత్రం అందకపోవడంతో పలుమార్లు జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులకు సమస్యను విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆరోపించారు.అనేక మార్లు బాధిత రైతులు కామేపల్లి తాహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి విన్నవించిన రైతులకు ఎలాంటి సమాధానం రాలేదని దీంతో ఆ కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.

## జగిత్యాల జిల్లాలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ❖ ప్రభుత్వ కార్యాలయ భవనాలతో ప్రజలకు మెరుగైన సేవలు
- ❖ రిజిస్ట్రేషన్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకువస్తాం..
- ❖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ❖ అభివృద్ధి సంక్షేమ మాప్రభుత్వం లక్ష్యం: మంత్రి అడ్లూరి..



**దశ, జగిత్యాల :** జిల్లాలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాలను ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లాలో ఒకే రోజు రూ.11.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో జగిత్యాల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల భవన నిర్మాణాలకు చెరో రూ.2.25 కోట్లు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు చెరో రూ.2.25 కోట్లు, మాల్యాల, మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణాలకు చెరో రూ.1.40 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.నూతన కార్యాలయ భవనాలను ఆధునిక సౌకర్యాలతో నిర్మించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, సౌకర్యవంతంగా అందుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యాలయాల నిర్మాణంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను బలోపేతం చేసి ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.